క్లుప్తంగా

పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలంటూ ధర్నా



ఏలేశ్వరం తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న లిబరేషన్ శ్రేణులు, మహిళలు

ఏలేశ్వరం: పేదలకు ఇళ్లస్థలాలు కేటాయించాలని కోరుతూ పట్టణంలో సోమవారం ధర్నా నిర్వహించారు. సీపీఐ(ఎంఎల్) లిబరేషన్, ఇళ్ల స్థలాల పోరాట కమిటీ ఆధ్వర్యంలో స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా లిబరేషన్ జిల్లా కార్యదర్శి ఏగుపాటి అర్జునరావు మాట్లాడుతూ పట్టణంలో ఇళ్లు లేక అనేకమంది నిరుపేదలు ఇబ్బందులు పడుతున్నార న్నారు. షాపుల్లో పనిచేసేవారు, ఆటోవర్కర్స్, చిరువ్యాపారులు తదితర కార్మికులు సొంతిళ్లు లేక అద్దె ఇళ్లల్లో అవస్థలు పడుతున్నారని విమర్శించారు. కొంతమంది బ్రోకర్లు ఎర్రజెండా పేరుతో ఇళ్లస్థలాలు ఇప్పిస్తామని పేదల నుంచి నగదు దోచుకుంటున్నారని ఆరోపించారు. వీరిపై విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్ వెంకటేశ్వరరావుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో పిల్లా కాంతం, నాగేశ్వరరావు, సుందరి, అప్పయ్యమ్మ తదితరులు పాల్గొన్నారు.

అరుణాచలేశ్వరస్వామికి విశేష పూజలు



రాచపల్లిలో విశేష అలంకరణలో అరుణాచలేశ్వరస్వామి

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని అపిత కుచాంబ సమేత అరుణాచలేశ్వరస్వామి దేవస్థానంలో సోమవారం విశేష పూజలు నిర్వహించారు. ఉదయం పండితులు స్వామి వారికి మహాన్యాసపూర్వక రుద్రాభిషేకం, ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. అనంతరం స్వామి వారిని పూలతో విశేషంగా అలంకరించారు. మండల నలుమూలల నుంచి భారీగా తరలివచ్చిన భక్తులు స్వామి వారిని దర్శించుకొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

బీమా సొమ్ము అందజేత



ధనలక్ష్మికి బీమా సొమ్ము అందజేస్తున్న అధికారులు

గోకవరం: మండలంలోని కామరాజుపేటలో శ్రీవేణుగోపాల ప్రాథమిక సహకార సంఘం సభ్యుడు కె.శ్రీరామమూర్తి ఇటీవల మృతి చెందారు. కాగా ఆమె భార్య ధనలక్ష్మికి రూ.2 లక్షల బీమా సొమ్మును సోమవారం అందజేశారు. గోకవరం డీసీసీబీ బ్యాంకులో పీపీఐసీ మల్యాల కృష్ణమోహన్, సీఈఓ కామిశెట్టి వీరభద్రరావు, బ్యాంక్ మేనేజర్ షేక్ యాసిన్ బాధితురాలికి చెక్కును అందజేశారు.

నల్లజెండాలతో నిరసన



గోకవరంలో నల్లజెండాలతో నిరసన తెలుపుతున్న గుమ్మళ్లదొడ్డి గ్రామస్తులు

గోకవరం: మండలంలోని గుమ్మళ్లదొడ్డిలో అస్సాగో ఇథనాల్ ఫ్యాక్టరీ సమస్యను పరిష్కరించాలని కోరుతూ గోకవరం తహసీల్దార్ కార్యాలయం ఎదుట సోమవారం ఆ గ్రామస్తులు నల్లజెండాలతో నిరసన తెలిపారు. ఈ నెల 28న గ్రామంలో నిర్వహించనున్న అఖిలపక్ష సమావేశానికి అనుమతి ఇవ్వాలని ఇన్‌చార్జి తహసీల్దార్ ప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయం ఎదుట నల్లజెండాలతో ఆందోళన చేశారు. సమస్యకు శాశ్వత పరిష్కారం చూపే వరకు పోరాటం ఆగదని హెచ్చరించారు.

సొసైటీ అధికారులను అడ్డుకున్న రైతులు

కిర్లంపూడి: ప్రత్తిపాడు డీసీసీబీలో తీసుకున్న రుణాలు కట్టనివారి భూములను ఈ నెల 21న ఆక్షన్ వేస్తామని నోటీసులు ఇవ్వటానికి వెళ్లిన అధికారులను రైతులు అడ్డుకున్నారు. వేలంకలోని బ్యాంకులో రుణాలు తీసుకున్న రైతులకు నోటీసులు ఇచ్చేందుకు సోమవారం అధికారులు వెళ్లారు. కిర్లంపూడి సొసైటీలో జరిగిన అవకతవకలపై జరుగుతున్న విచారణ పూర్తి కాకుండా ఎలా నోటీసులు ఇస్తున్నారని అధికారులను నిలదీశారు. వెళ్లిన అధికారుల్లో ప్రత్తిపాడు డీసీసీబీ బ్యాంక్ ఏజీఎం సత్యనారాయణ, మేనేజర్లు వెంకటరమణ, కుక్కుటేశ్వరరావు, సూపర్ వైజర్ శ్రీహరి, కిర్లంపూడి సొసైటీ సీఈఓ పంపన వెంకట రమణ, సిబ్బంది పాల్గొన్నారు.

రబీ వరిసాగుకు శ్రీకారం

- వ్యవసాయ బోర్ల పరిధిలో నారుమడులు సిద్ధం
- ఖరీఫ్ పనులు పూర్తయితే పీబీసీ ఆయకట్టులోనూ సాగు
- పంపా ఆయకట్టు పరిధిలో అపరాలు



కోదాడలో వరినాట్లు వేస్తున్న కూలీలు



బెండపూడిలో వ్యవసాయబోర్ల పరిధిలో వేసిన వరి నారు మడి

తొండంగి: ఈ ఏడాది వర్షాలు పుష్కలంగా కురవడంతో రెండో పంట సాగుకు రైతులు సన్నద్ధమవుతున్నారు. వ్యవసాయబోర్ల పరిధిలో ఇప్పటికే నారుమడులు వేశారు. నారు ఎదగడంతో వరినాట్లకు రైతులు సిద్ధమయ్యారు. అక్కడక్కడ పనులు కూడా ప్రారంభమయ్యాయి. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం బలహీనపడడంతో వాతావరణ శాఖ ప్రకటించిన నేపథ్యంలో మెట్ట, పల్లపు ప్రాంతాల్లో ఖరీఫ్ వరికోతలు పనులు కూడా జోరుగా సాగుతున్నాయి. పీబీసీ ఆయకట్టు పరిధిలో రబీసాగు జరగనుంది. కాగా పంపా రిజర్వాయర్‌లో పుష్కర, పోలవరం అక్విడెక్టు, గేట్లు పనుల దృష్ట్యా రబీ సాగుకు సాగునీటి విడుదల చేయడం లేదని జిల్లా కలెక్టర్, ఇరిగేషన్ అధికారులు అప్పటికే ప్రకటించడంతో ఆయా ఆయకట్టు రైతులందరూ అపరాలు సాగు వేస్తున్నారు.

నియోజకవర్గంలో ఇలా...

తుని నియోజకవర్గంలో తుని మండలంలోని వ్యవసాయబోర్లు పరిధిలో దాదాపు 200 ఎకరాల్లో మాత్రమే ఈ ఏడాది రబీ సాగు జరుగుతోంది. తాండవ ఆయకట్టు ప్రాంతమైన కోటనందూరు, తుని మండలాల్లో రబీలో వరి కాకుండా అపరాలు వేస్తున్నారు. తొండంగి మండలంలోని మెట్ట, పల్లపు ప్రాంతాల్లో దాదాపు 600 వ్యవసాయబోర్లు ఉన్నాయి. వీటి ద్వారా 2500 ఎకరాలు రబీలో వరి సాగు జరుగుతోంది. ఈనేపథ్యంలో తొలకరి నుంచి వ్యవసాయ బోర్లు ఉన్న రైతులు సాగునీటి లభ్యత ఉండడంతో ఖరీఫ్‌లో వరినాట్లు ముందుగా వేయడంతో పంట ఒబ్బిడి పనులు కూడా ముందుగానే పూర్తయ్యాయి. దీంతో రెండో పంటగా రబీలో వరి సాగు చేసేందుకు ఇప్పటికే నారు మడులు సిద్ధం చేసుకున్నారు. నారు తయారుకావడంతో పంట పొలాలను దమ్ము చేయించి నాట్లు వేయిస్తున్నారు. అదేవిధంగా పీబీసీ ఆయకట్టు పరిధిలోనూ రబీలో వరిసాగు జరగనుంది. ఆయా ప్రాంతాల్లో పంట ఒబ్బిడి పనులు జోరుగా సాగుతున్నాయి. ఈప్రాంతంలో కూడా దాదాపు 1500 ఎకరాల్లో రబీ వరినాట్లు వేయనున్నారు.

రబీలో తగ్గనున్న వరిసాగు



మండలంలోని ఈఏడాది వ్యవసాయబోర్లతోపాటు, పంపా, పీబీసీ ఆయకట్టు పరిధిలో రబీ వరిసాగు ఎక్కువ విస్తీర్ణంలో జరుగుతుందని అనుకున్నాం. పంపా ఆయకట్టులో రబీలో ఆరు వేల ఎకరాలకు పైగా వరినాట్లు వేసేవారు. ఇప్పటికే 700 హెక్టార్లలో అపరాలు జరిగింది. వ్యవసాయబోర్లు, పీబీసీ పరిధిలో మాత్రమే రబీలో వరి నాట్లు వేయనున్న నేపథ్యంలో సాగు విస్తీర్ణం తగ్గనుంది. వరిసాగు చేస్తున్న రైతులంతా నెలాఖారులోగా పంట బీమా చెల్లించాల్సి ఉంది.

– ఎస్.నరసింహం, వ్యవసాయశాఖాధికారి, తొండంగి మండలం

నేటి నుంచి ఆధార్ ప్రత్యేక క్యాంపులు

గోకవరం: జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మండల పరిధిలోని గ్రామాల్లో నాలుగు రోజుల పాటు ఆధార్ ప్రత్యేక క్యాంపులు ఏర్పాటు చేస్తున్నట్టు ఎంపీడీఓ గోవిందు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. మంగళవారం జగన్నాథపురం, గంగంపాలెం గ్రామాల్లో, 18, 19న గుమ్మళ్లదొడ్డి, తిరుమలాయపాలెం, 20న కృష్ణునిపాలెం, రంపయర్రంపాలెం గ్రామాల్లో ప్రత్యేక ఆధార్ కేంద్రాలు నిర్వహిస్తారన్నారు. ఆయా గ్రామాల్లోని సచివాలయాల్లో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు క్యాంపులు నిర్వహిస్తారని చెప్పారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఆధార్‌లో మార్పులు, చేర్పులు చేసుకోవాలని సూచించారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో జరిమానా

ప్రత్తిపాడు: డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో పట్టుబడిన ఆరుగురికి న్యాయమూర్తి సోమవారం రూ.60 వేలు జరిమానా విధిస్తూ తీర్పు ఇచ్చినట్టు స్థానిక సీఐ బి.సూర్య అప్పారావు తెలిపారు. స్థానిక పోలీస్ సర్కిల్ పరిధిలోని ప్రత్తిపాడు, ఏలేశ్వరం, అన్నవరం పోలీస్ స్టేషన్ల పరిధిలో మద్యం సేవించి, వాహనాలు నడుపుతున్న ఏడుగురిని అదుపులోకి తీసుకున్నారు. వీరిని ప్రత్తిపాడు జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి కాటం భాను ఆరుగురికి ఒక్కొక్కరికి రూ. 10 వేల వంతున రూ. 60,000 జరిమానా విధించారు. ఒకరికి వారం రోజుల పాటు జైలు శిక్ష విధించినట్టు సీఐ సూర్య అప్పారావు తెలిపారు.

మంచు మసకేసిందిలే..



తునిలో కనువిందు చేస్తున్న మంచు దుప్పటి

తుని: సాధారణంగా హిమాలయాలు, ఎత్తయిన కనుమల్లో మంచు దుప్పటితో ఆకాశం ఆహ్లాదకరంగా మారి పర్యాటకులను ఆకర్షించడం పరిపాటి. కాగా సోమవారం ఉదయం తుని పట్టణంలో మంచు దుప్పటి కనువిందు చేసింది. దట్టమైన మంచు కొండల నుంచి జాలు వారడంతో పట్టణంలో చల్లని వాతావరణం సంతరించుకొంది. తుని రైల్వేస్టేషన్, పార్కులు ఇలా అనేక ప్రాంతాల్లో మంచు కనువిందు చేసింది. వాతావరణంలో వచ్చిన మార్పుల వలన భారీగా మంచు కురిసిందని తుని వాతావరణ కేంద్రం అధికారులు తెలిపారు. ప్రజలు మాత్రం రెండు గంటల పాటు చల్లటి వాతావరణాన్ని ఆస్వాదించారు.

పొగమంచుతో ఇక్కట్లు

ప్రత్తిపాడు: గ్రామాల్లో చలి తీవ్రత పెరిగింది. ప్రతి రోజూ ఉదయం మంచు పడుతోంది. ఉదయం 8 గంటలైనా సూరీడు జాడ కనిపించడం లేదు. కొద్ది రోజులుగా పొగమంచు రోడ్లను కమ్మేయడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండల కేంద్రమైన ప్రత్తిపాడులో సోమవారం ఉదయం 8 గంటలు దాటినా దట్టంగా కమ్ముకున్న పొగమంచు వదలకపోవడంతో రహదారులు కనబడక ప్రజలు, కూలీలు, వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఎదురుగా వచ్చే వాహనాలను గుర్తించలేక లైట్లు వేసుకుని వెళ్తున్నారు. కాగా మంచు ప్రభావానికి జీడి మామిడి, మామిడి పూత రాలిపోతోందని రైతులు ఆందోళన చెందుతున్నారు.

నేటి నుంచి సర్పంచులు, పంచాయతీ సిబ్బందికి శిక్షణ

ప్రత్తిపాడు: గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళికల తయారీపై ప్రత్తిపాడులో మంగళవారం నుంచి రెండు రోజుల పాటు శిక్షణా తరగతులు నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ ఎంవీఆర్ కుమార్ బాబు తెలిపారు. గ్రామ పంచాయతీ సర్పంచులు, కార్యదర్శులు, మండల స్థాయి అధికారులు, సచివాలయ సిబ్బందికి ఉదయం 9.30 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు శిక్షణా తరగతులను నిర్వహిస్తామన్నారు. మండల పరిషత్ కార్యాలయం, వెలుగు కార్యాలయాల్లో నిర్వహించే శిక్షణా తరగతులను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

శంఖవరం: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం నుంచి సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులకు శిక్షణా తరగతులు నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ ఎస్ఎస్ శర్మ తెలిపారు. పంచాయతీ అభివృద్ధి ప్రణాళికల తయారీపై రెండు రోజుల పాటు శిక్షణ తరగతులు నిర్వహిస్తామన్నారు. మండలంలోని సర్పంచులు, కార్యదర్శులు, సచివాలయం సిబ్బంది శిక్షణా తరగతులకు హాజరుకావాలని కోరారు.

నేడు, రేపు శిక్షణ

రౌతులపూడి: గ్రామాల్లో సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై మండలంలోని ఆయా గ్రామాల సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులకు మంగళ, బుధవారాల్లో శిక్షణా తరగతులు నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ శివరామకృష్ణయ్య తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఉదయం తొమిది గంటల నుంచి సాయంత్రం ఐదు గంటలు వరకు శిక్షణ ఉంటుందన్నారు. మండలంలోని అన్ని గ్రామాల సర్పంచులు, పంచాయితీ కార్యదర్శులు తప్పనిసరిగా హాజరుకావాలని ఆయన కోరారు.

రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న డిప్యూటీ కలెక్టర్ శ్రీనివాసరావు

ప్రత్తిపాడు రూరల్: గ్రామాల్లో నిర్వహించే రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని డిప్యూటీ కలెక్టర్ ఎ.శ్రీనివాసరావు సూచించారు. మండలంలోని చింతలూరు, యూజే పురం గ్రామాల్లో సోమవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులను డిప్యూటీ కలెక్టర్ శ్రీనివాసరావు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూ సమస్యల సత్వర పరిష్కారానికి రెవెన్యూ సదస్సులు ఎంతగానో దోహదపడతాయని తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ పుణ్యవతి, ఎంఆర్ఐ గోపాలకృష్ణ, జింకల తాతారావు, పంద్రాడ రాము తదితరులు పాల్గొన్నారు.

మొక్కుబడిగా రెవెన్యూ సదస్సులు



రమణయ్యపేటలో మొక్కుబడిగా నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సు

ఏలేశ్వరం: భూ సమస్యల పరిష్కారం కోసం గ్రామాల్లో నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులు మొక్కుబడిగా సాగుతున్నాయి. గ్రామాల్లో నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులకు ప్రజల నుంచి స్పందన కరువైంది. ఎటువంటి ముందస్తు సమాచారం లేకుండా అధికారులు సదస్సులు నిర్వహిస్తున్నారు. ఇప్పటివరకు మండలంలోని మర్రివీడు, జె.అన్నవరం, తూర్పులక్ష్మీపురం గ్రామాల్లో సదస్సులు నిర్వహించారు. రమణయ్యపేటలో సోమవారం నిర్వహించిన సదస్సుకు నామమాత్రంగా కూడా రైతులు, ప్రజలు హాజరు కాలేదు. కేవలం ప్రజాప్రతినిధులతో సదస్సు నిర్వహించి చేతులు దులుపుకొన్నారు. సదస్సుకు డిప్యూటీ తహసీల్దార్ కుశరాజు, సీనియర్ అసిస్టెంట్ పొన్నాలు, ఎంపీటీసీ సభ్యుడు యిజనగిరి ప్రసాద్, రమేష్‌రాజు, గుమ్ములూరి వె వెంకటరమణ తదితరులు హాజరయ్యారు. కాగా రమణయ్యపేట సదస్సుకు కేవలం మూడు ఫిర్యాదులు మాత్రమే వచ్చాయి. ముందస్తు సమాచారం లేకుండా సభలు నిర్వహించడంపై స్థానికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వానికి ప్రచార ఆర్భాటం తప్ప ప్రజా సమస్యల పరిష్కారంపై చిత్తశుద్ధి లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.

క్షేత్రస్థాయిలో పార్టీ బలోపేతమే లక్ష్యం



ఉత్తరకంచిలో బూత్ అధ్యక్షుడు ఉమ్మిడి వెంకట్రావుకు నియామక పత్రాన్ని అందజేస్తున్న దృశ్యం

ప్రత్తిపాడు రూరల్: క్షేత్రస్థాయిలో పార్టీ బలోపేతమే లక్ష్యంగా బూత్ స్థాయి అధ్యక్షుల నియామకం చేపట్టినట్లు బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు ఉమ్మిడి వెంకట్రావు తెలిపారు. మండలంలోని పలు గ్రామాల్లో సోమవారం బీజేపీ బూత్ స్థాయి అధ్యక్షుల నియామకం చేపట్టారు. ఉత్తరకంచిలో 71 వార్డు అధ్యక్షుడిగా ఉమ్మిడి వెంకట్రావు, 72వ వార్డు అధ్యక్షుడిగా శీరం ఉమామహేశ్వరరావు, ఒమ్మంగిలో 100వ బూత్ అధ్యక్షురాలిగా తేజోమూర్తుల ఉషారాణి నియమితులయ్యారు. కార్యక్రమంలో బీజేపీ మండల ఉపాధ్యక్షుడు ఊటా వీరబాబు, రామకుర్తి సూర్యనారాయణ, నానిపల్లి శ్రీనివాసరావు, బొడ్డు ముత్యాలరావు, వాడపల్లి బుల్లెమ్మ తదితరులు పాల్గొన్నారు.

భూదాన భూములను నిషేధిత జాబితా నుంచి తొలగించాలి



కిర్లంపూడిలో డిప్యూటీ తహసీల్దార్ సాయికిరణ్‌కు వినతి పత్రం అందజేస్తున్న రైతులు

కిర్లంపూడి: భూదాన భూములను నిషేధిత జాబితా నుంచి తొలగించాలని పలువురు రైతులు కోరారు. ఈ మేరకు సోమవారం కిర్లంపూడిలో డిప్యూటీ తహసీల్దార్ సాయికిరణ్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కిర్లంపూడి, ముక్కొల్లు, జగపతినగరం గ్రామాల్లోని భూములు తమ పూర్వీకుల నుంచి తమకు వచ్చాయన్నారు. ప్రభుత్వం భూదాన భూమిని 22ఏ నిషేధిత జాబితాలో చేర్చడం వల్ల వ్యక్తిగత అవసరాలు, పిల్లల చదువుల నిమ్మిత్తం ఆ భూములను అమ్మాలంటే రిజిస్ట్రేషన్ అవ్వడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. భూదాన భూములను నిషేధిత జాబితా నుంచి తొలగించి జిరాయితీ భూములుగా మార్చాలని కోరారు. కార్యక్రమంలో రైతులు బుద్ద సాయిబాబు, దాడి పెద్దబుజ్జి, పొలిమేరు రాంబాబు, శరకణం భద్రం, కర్రి వెంకటరమణమూర్తి, కర్రి వీరబాబు, కర్రి కృష్ణ, కర్రి అర్జున్ తదితరులు పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి



మండపం అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న ఆర్‌డబ్ల్యుఎస్ కో ఆర్డినేటర్ నాగేశ్వరరావు

శంఖవరం: ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని స్టేట్ ఆర్‌డబ్ల్యుఎస్ కో ఆర్డినేటర్ కె.నాగేశ్వరరావు సూచించారు. మండలంలోని మండపం, జి.కొత్తపల్లి, శంఖవరం గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో చేపట్టిన అభివృద్ధి పనులను సోమవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలల్లో పరిసరాలు, మరుగుదొడ్లు శుభ్రంగా ఉండాలన్నారు. విద్యార్థులకు స్వచ్ఛమైన తాగునీరు, సంపూర్ణ పోషకాహారం అందించాలని సూచించారు. కార్యక్రమంలో సీడీపీఓ పద్మావతి, సూపర్‌వైజర్ అరుణశ్రీ తదితరులు పాల్గొన్నారు.

వచ్చే నెలలో ప్రచారం ప్రారంభిస్తా

- వైఎస్సార్ సీపీ ప్రత్తిపాడు నియోజకవర్గ ఇన్‌చార్జి ముద్రగడ గిరిబాబు



సత్యదేవుని సన్నిధిలో కుటుంబ సభ్యులతో ముద్రగడ గిరిబాబు

అన్నవరం: వచ్చే నెల 3వ తేదీ తరువాత ప్రత్తిపాడు నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ నాయకులను కలిసి ప్రచారం ప్రారంభించనున్నట్లు ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి ముద్రగడ గిరిబాబు తెలిపారు. ఆయన కుటుంబ సభ్యులతో కలిసి సోమవారం రత్నగిరిపై సత్యదేవుని దర్శించి పూజలు చేశారు. ఈ సందర్భంగా విలేకర్లతో మాట్లాడుతూ జనవరి 3 వరకూ ముందుగా నిర్ణయించిన కార్యక్రమాలు ఉన్నాయన్నారు. 3వ తేదీ తరువాత తన తండ్రి, మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభం, ఇతర శ్రేయాభిలాషులతో కలిసి నియోజకవర్గంలో పార్టీ శ్రేణులను కలుస్తానని వివరించారు. తొలుత సత్యదేవుని ఆలయం వద్ద గిరిబాబుకు పండితులు ఘనంగా స్వాగతం పలికారు. స్వామివారి దర్శనం అనంతరం వేదపండితులు వేదాశీస్సులు అందచేసి స్వామివారి ప్రసాదాలు బహూకరించారు.

మోగిన నెలగంట

- ధనుర్మాసోత్సవాలు ప్రారంభం
- ఆలయాలకు భక్తులు తాకిడి



ఎస్.అన్నవరం వేంకటేశ్వరస్వామి ఆలయంలో గంట పూజ చేస్తున్న అర్చకులు

తుని రూరల్: గ్రామాల్లోని ఆలయాల్లో నెలగంట మోగింది. ఏటా మకర సంక్రాంతికి నెలరోజుల ముందు నెలగంట మోగించి ధనుర్మాసోత్సవాలను ప్రారంభిస్తారు. దీనిలో భాగంగా సోమవారం ఉదయం 6.44 గంటలకు ఎస్.అన్నవరంలో కొలువైన శ్రీదేవి, భూదేవి సమేత ప్రసన్న వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో అర్చకులు ప్రత్యేక పూజలతో నెలగంట మోగించి ధనుర్మాస పూజలు ప్రారంభించారు. ఈ సందర్భంగా విశ్వక్షేన ఆరాధన, పల్లకీసేవ, గోపూజ, హోమం పూర్ణాహుతి నిర్వహించారు. దాత పెనుమూడి వీరభద్రరావు అందజేసిన వేదపారాయణ పీఠాన్ని అర్చకులు ఆవిష్కరించారు. పాత సంచుల వర్తక సంఘం ఆధ్వర్యంలో ధనుర్మాస ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఉత్సవాల్లో స్వామి అమ్మవార్లు, పరివార దేవతలను అలంకరించేందుకు 50 మంది భక్తులు వస్త్రాలను సమర్పించారు. ధర్మకర్తలు, భక్తులు పాల్గొన్నారు. కుమ్మరిలోవ తపోవనంలో జనవరి 13 వరకు ధనుర్మాస పూజలు నిర్వహించనున్నట్టు పీఠాధిపతి సచ్చిదానంద సరస్వతీ మహాస్వామి తెలిపారు.

తంటికొండ దేవస్థానంలో...

గోకవరం: మండలంలోని తంటికొండలో వేంచేసిన శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో సోమవారం ధనుర్మాసోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. దేవస్థానం ఈఓ వడ్డాది సత్యనారాయణ, స్థానిక నాయకుడు బద్దిరెడ్డి అచ్చన్నదొర ఆధ్వర్యంలో ఉదయం 6.44 గంటలకు తీర్థం బిందెను తీసుకువచ్చి ధనుర్మాసోత్సవాలను ప్రారంభించారు. అనంతరం స్వామివారికి విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం, ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. విశేష సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

శివాలయంలో ప్రత్యేక అభిషేకాలు

గోకవరం: గ్రామంలో ప్రసిద్ధిగాంచిన పర్వతవర్ధినీ సమేత రామలింగేశ్వరస్వామి ఆలయం (శివాలయం)లో సోమవారం ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. ధనుర్మాసం ప్రారంభం, ఆరుద్ర నక్షత్రాన్ని పురస్కరించుకుని తెల్లవారుజామున 3 గంటల నుంచి స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. స్థానిక రమాసత్యనారాయణస్వామి ఆలయంలో ఉమాసమేత గోకర్ణేశ్వరస్వామికి విశేష పూజలు నిర్వహించారు.



తంటికొండ దేవస్థానంలో తీర్థపు బిందెను తీసుకువస్తున్న అర్చకులు



ఎస్.అన్నవరంలో స్వామివారి దర్శనానికి క్యూ కట్టిన భక్తులు

అధ్యాపకులు అప్‌గ్రేడ్ కావాలి

గండేపల్లి: విద్యార్థులకు శిక్షణ ఇవ్వడంలో అధ్యాపకులు అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో తమను తాము అప్‌గ్రేడ్ చేసుకోవాలని ప్రగతి ఇంజినీరింగ్ కళాశాల చైర్మన్ పి.కృష్ణారావు సూచించారు. మండలంలోని సూరంపాలెం ప్రగతి ఇంజినీరింగ్ కళాశాలలో ఐదు రోజుల పాటు నిర్వహించే అధ్యాపకుల అభివృద్ధి కార్యక్రమాన్ని సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధ్యాపకులు అప్‌గ్రేడ్ అయితే విద్యార్థులకు వృత్తి, విద్య పరంగా మార్గనిర్దేశం చేస్తారన్నారు. తమిళనాడు ఐసీటీ అకాడమీ సీనియర్ టెక్నికల్ ట్రైనర్ జె.ఆనంద్ రిసోర్స్ పర్సన్‌గా పలు అంశాలను వివరించారు. ఐసిటీ అకాడమీ ప్రాంతీయ మేనేజర్ వై.సురేష్, ఫ్యాకల్టీ కో ఆర్డినేటర్ రుబియా తస్నీం, కెరీర్ డెవలప్‌మెంట్ సెంటర్ డీన్ ఎం.రాధికామణి, వివిధ విభాగాల అధిపతులు పాల్గొన్నారు.



అధ్యాపక అభివృద్ధి కార్యక్రమంలో పాల్గొన్న అధ్యాపకులు